క్లుప్తంగా

విద్యార్థుల రీజాయినింగ్



విద్యార్థులకు జేవీకే కిట్లు అందిస్తున్న డీఈవో చంద్రకళ

ఏయూక్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్చుకునే కార్యక్రమం ప్రారంభమైంది. 20వ వార్డు కేడీపీఎం పాఠశాలలో 2022–23 విద్యా సంవత్సరంలో ఫెయిలైన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్చుకున్నారు. వీరికి ప్రస్తుత బ్యాచ్ విద్యార్థులతో కలిసి తరగతులకు హాజరయ్యే అవకాశం కల్పించారు. సోమవారం డీఈవో ఎల్.చంద్రకళ చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక కిట్లను వీరికి అందించారు. ఫెయిలైన విద్యార్థులకు సైతం ప్రభుత్వ పథకాలు అందించేలా కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక



జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ సుభాష్‌కు స్వాగతం పలుకుతున్న భెల్ జై భీమ్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: నగరానికి విచ్చేసిన నేషనల్ ఎస్సీ కమిషన్ చైర్మన్ సుభాష్ పార్థీకి భెల్(హెచ్‌పీవీపీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(జై భీమ్) ప్రతినిధులు విశాఖ విమానాశ్రయంలో సోమవారం సాదర స్వాగతం పలికారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛాలను అందించారు. కమిషన్ చైర్మన్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ సమస్యలపై విన్నవించుకునేందుకు ప్రత్యేక సమయం కేటాయించినట్టు తెలిపారు. ఆ సమావేశంలో జై భీమ్ ప్యానల్ ప్రతినిధులు ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాన్ని కమిషన్ చైర్మన్‌ను అందించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జై భీమ్ ప్యానల్ అధ్యక్షుడు రవి కిషోర్, ప్రధాన కార్యదర్శి జె.రాము, కార్యనిర్వాహక అధ్యక్షుడు హెచ్.భోగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్లపై చర్యలకు వినతి



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: ప్రైవేటు క్యాంటీన్ల ప్రక్షాళనకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. సోమవారం డైరెక్టర్(పర్సనల్) ఎస్.సి.పాండేను కలిసిన నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాంటీన్ భోజనంలో నాణ్యతలేని ఆహారంతో ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆరోపించారు. క్యాంటీన్లు మురికి వాతావరణంలో నడుస్తున్నాయన్నారు. పనిచేయని సీలింగ్ ఫ్యాన్లు, దుర్గంధభరిత వాష్ బేసిన్లు, తాగేందుకు మంచినీరు కూడా అందుబాటులో ఉండని పరిస్థితని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ క్యాంటీన్లలో నాణ్యత లేని టీ పౌడర్ వినియోగిస్తున్నా, ప్రైవేట్ ఫ్రూట్ జ్యూస్ షాపులు ఇష్టం వచ్చిన ధరలకు విక్రయించి ఉద్యోగుల్ని లూటీ చేస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వీటిపై అధ్యయనానికి యూనియన్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, ప్రభాకరరెడ్డి, జి.వి.సుబ్బయ్య, బీఎంకే నాయక్, సుదర్శనం, నగేష్, గంగవరం గోపి పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.



మళ్ల ధనలతకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



గోపాలపట్నం ఆలయంలో పూజలు చేస్తున్న బెహరా భాస్కరరావు, పేడాడ రమణ కుమారి



సింథియా ఆలయంలో బాబాకు అభిషేకం

పాహిమాం సాయినాథా..

- ఘనంగా గురుపౌర్ణమి పూజలు
- షిర్డీ సాయి ఆలయాలకు పోటెత్తిన భక్తులు



పేద మహిళలకు చీరలు అందజేస్తున్న బౌద్ధ సమాజం సభ్యులు



గోపాలపట్నం ప్రశాంతినగర్ బాబా ఆలయంలో సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

గోపాలపట్నం: గోపాలపట్నం, ఎన్‌ఏడీ ప్రాంతాల్లోని షిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. గోపాలపట్నం ప్రశాంతినగర్ ఆలయంలో బాబాను విశేషంగా అలంకరించారు.

- జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ దరి అంబేడ్కర్‌నగర్‌లో షిర్డీ సాయి ఆలయంలో బాబాను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దంపతులు దర్శించుకున్నారు. అనంతరం అన్నదానంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాలు వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పొలిమేర వెంకట ఆదినారాయణ డిప్యూటీ మేయర్ దంపతులకు శేష వస్త్రాలు ప్రసాదం అందించారు.
- జీవీఎంసీ 91వ వార్డు గోపాలపట్నం సాయిబాబా ఆలయంలో నిర్వహించిన పూజల్లో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణ కుమారి పాల్గొన్నారు. అలాగే లక్ష్మీనగర్ నాలుగు కుళాయిల వద్ద సాయిబాబా ఆలయం, 92వ వార్డు ఆర్‌ఆర్‌వీపురం సాయిబాబా ఆలయంలో నిర్వహించిన పూజల్లో బెహరా భాస్కరరావుతో పాటు గుణిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతానికి ఆధ్యాత్మిక ఝురి

మల్కాపురం : గురుపౌర్ణమి సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో గల పలు సాయిబాబా ఆలయాల్లో సాయినాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. 58వ వార్డు పిలకవానిపాలెం వద్ద కొలువుదీరిన వనదుర్గా ఆలయంలో అమ్మవారికి వివిధ కూరగాయలతో శాకంబరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధి శివరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా అమ్మవారిని శాకంబరిదేవిగా అలంకరిస్తామన్నారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీను, పోత్తబత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 59వ వార్డు గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్, ఇండ్రస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్ పాల్గొని సాయినాథునికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. 60వ వార్డు గుల్లలపాలెం, మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్టుబోర్డు మెంబర్ మళ్ల ధనలత తదితరులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ధనలతకు బాబా చిత్రపటం అందజేశారు. 61వ వార్డు మల్కాపురం, వెంకన్నపాలెం తదితర ప్రాంతాల్లో గల సాయిబాబా ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.

ఘనంగా గురుపౌర్ణమి

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని రామాలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ ప్రాంగణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో బాబాకు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు అఖండ హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్డు కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త గుండపు నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో సాయిబాబా విగ్రహదాత జెర్రిపోతుల బాబూరావు దంపతులు, నాగభూషణం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు



శాకంబరిగా దర్శనమిచ్చిన పిలకవానిపాలెం దుర్గాదేవి

108 కలశాలతో పూజలు

షిప్‌యార్డ్‌కాలనీ గాంధీగ్రామంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బాబాకు మంగళస్నానంతో పాటు 108 కలశాలతో క్షీరాభిషేకం అనంతరం పుష్పార్చన నిర్వహించారు. సాయి గాన లహరిలో సాయి బాబా పాటలను పాడుతూ ఓం సాయి, శ్రీ సాయి–జయ జయ సాయి అంటూ నామస్మరణ చేశారు. అనంతరం శ్రీ షిర్డీ సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

బౌద్ధాలయంలో పూజలు

కంచరపాలెం: స్థానిక అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుడికి ప్రత్యేక పూజలు చేశారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిపారు. కార్యక్రమంలో సిహెచ్.బాబూరావు, రాజు, భీమారావు, సూరిబాబు, రాము, రామచంద్రరావు, పరిమళ, సునీల్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ అందజేత



కొత్తపాలెంలో కాంతంకు పింఛన్‌ను అందిస్తున్న గోపి, ఆళ్ల పైడిరాజు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం ప్రాంతానికి చెందిన గోగులుమట్టం కాంతం అనే మహిళకు వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ సొంత నిధులతో పింఛన్ అందిస్తున్నారు. ఆ నగదును సోమవారం వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ(గోపి), ఆళ్ల పైడిరాజు అందించారు. ప్రభుత్వ పింఛన్ మంజూరైనంత వరకు ఆమెకు నెలకు రూ.2750 పింఛను అందిస్తామని తెలిపారు.

మేకల మేతకు వెళ్లి జారి పడ్డాడా..

అస్థిపంజరం కేసులో పోలీసుల దర్యాప్తు

ఉక్కునగరం: తన మేకలకు మేత కోసం చెట్టు ఎక్కి జారిపడిన సంఘటనలో వ్యక్తి మృతి చెందాడా? లేకా ఎవరైనా కొట్టిపడేశారా? అనే అంశంపై స్టీల్‌ప్లాంట్ పోలీసుల దర్యాప్తు సాగుతుంది. కొట్టిపడేస్తే కత్తిని అక్కడ వదలరు, కత్తిపై కనీసం రక్తపు మరకలు లేకపోవడం వంటి అంశాలను పరిశీలిస్తే అతను చెట్టు నుంచి జారి పడటం వల్లే మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. చెట్టు పక్కన నరికిన కొమ్మలు, చెట్టు కింద చెప్పులు ఉండటం వాటికి బలం చేకూరుస్తున్నాయి. అస్థిపంజరం గాజువాకకు చెందిన వ్యక్తిదిగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్టు తెలుస్తుంది. గాజువాక ప్రాంతంలో గంజాయి సేవిస్తూ చిల్లర దొంగతనాల చేసే వ్యక్తే అతను అని భావిస్తున్నారు. సదరు వ్యక్తి గొర్రెలను దొంగిలించి స్టీల్‌ప్లాంట్ సమీప ప్రాంతంలో తనకు పరిచయం ఉన్న మహిళ వద్ద దాస్తుంటాడని సమాచారం. వాటిని కొంత కాలం తన వద్ద ఉంచి తర్వాత అమ్ముతుంటాడని తెలుస్తుంది. ఇందులో భాగంగా చెట్టు ఎక్కి కొమ్మలు కొట్టే క్రమంలో అతని జారి పడి ఉంటాడని.. ఆ ప్రాంతం రోడ్డుకు దూరంగా ఉండటంతో ఎవరూ గుర్తించలేదని భావిస్తున్నారు. దాదాపు కొలిక్కి వచ్చిన ఈ కేసు విచారణ ఒకట్రెండు రోజుల్లో పూర్తవుతుందని పోలీసు వర్గాల సమాచారం.

అందరికీ రక్ష.. జగనన్న సురక్ష



కార్యక్రమంలో మాట్లాడుతున్న భోగవల్లి

మల్కాపురం : ప్రతి కుటుంబానికి రక్ష జగనన్న సురక్ష అని 40,61,62,63 వార్డుల పార్టీ పరిశీలకుడు భోగవల్లి నాగభూషణం అన్నారు. 61వ వార్డు మల్కాపురం, మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద గల సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అర్హులకు జనన ధ్రువపత్రాలు, కొత్త రైస్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం, మరణ ధ్రువపత్రం.. ఇలా ఏది కావాలన్నా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అది సాధ్యమవుతుందని అన్నారు. అర్హత ఉన్న వారు ప్రభుత్వ పథకాలు రావటం లేదని నిరుత్సాహపడకూడదన్నారు. ఇకపై వలంటీర్ ద్వారా నేరుగా ఇంటి వద్దే ఈ సేవలన్ని అందుతాయన్నారు. అవసరమైన ధ్రువపత్రాల కోసం ఎవరికీ ఒక్క పైసా ఇవ్వనవసరం లేదన్నారు. వలంటీర్ ఇంటికే వచ్చి ధ్రువపత్రాల జారీకి అవసరమైన పత్రాలను సచివాలయానికి తీసుకెళ్లి, అక్కడ దరకాస్తు చేస్తారన్నారు. అనంతరం సర్టిఫికెట్ లబ్ధిదారు ఇంటికే తీసుకువస్తారన్నారు. ఈ సందర్భంగా పలువురు ధ్రువపత్రాల కోసం దరకాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొల్లి నూకరెడ్డి, సోనూ, బాలు, చట్టి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సేవలో తరించి..



ఉదయం 5.30 గంటలకు లక్ష్మీనగర్ రోడ్డులో గిరిప్రదక్షిణ భక్తులు



భక్తులకు అల్పాహారం అందిస్తున్న దృశ్యం



బీఆర్‌టీఎస్ రోడ్డులో చెత్త ఎత్తుతున్న పారిశుధ్య కార్మికులు

గోపాలపట్నం: గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు విశేష సేవలందించారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు దారిపొడవునా అల్పాహారం, పులిహోర, మజ్జిగ వంటి పదార్థాలు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థలతో పాటు అపార్ట్‌మెంట్ల అసోషియేషన్ సభ్యులు, మరి కొన్ని కుటుంబాలు భక్తుల సేవలో తరించాయి. ఎన్ఎస్‌టీఎల్ ఫ్యామిలీ గేట్ నుంచి ఇందిరానగర్ వరకు జనసంద్రంగా మారింది. ఇసుక వేస్తే రాలనంతగా రద్దీ పెరిగింది. సోమవారం ఉదయం 4 నుంచి 8గంటల వరకు ఈ రహదారిలో భక్తుల రద్దీ కొనసాగింది. ఉదయం 11 గంటల వరకు భక్తులు నడుస్తూనే ఉన్నారు. ఉదయం ఈ స్థాయిలో భక్తులు రావడం ఇదే తొలిసారి అని లక్ష్మీనగర్, ఇందిరానగర్ వాసులు చెబుతున్నారు. లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో ఆటో ఉల్లిపాయల వ్యాపారుల అసోసియేషన్ సభ్యులు రాత్రంతా భక్తుల సేవలో ఉన్నారు. రాత్రి సమయంలో బొప్పాయి, పైనాపిల్, జామ, ఖర్జూరం వంటి పలు రకాల పండ్లు అందించారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు.

పారిశుధ్య కార్మికుల సేవలు భేష్

రాత్రి నుంచి ఏకధాటిగా పారిశుధ్య కార్మికులు సేవలందించారు. భక్తులు వినియోగించి పడేసిన వాటిని ఎప్పటికప్పుడు తొలగించారు.ఈ ఏడాది పారిశుధ్య నిర్వహణ చాలా బాగుందని భక్తులు, స్థానికులు, కొనియాడుతున్నారు. 90, 91, 92 వార్డుల్లో పారిశుధ్య కార్మికుల పని తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్‌రహిత జీవనం అలవర్చుకోవాలి

ఏయూక్యాంపస్ : ప్లాస్టిక్‌రహిత జీవనాన్ని అలవరచుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ ఫ్రీ బ్యాగ్ డేని పురస్కరించుకుని ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విడనాడాలి–చేతి సంచులను వినియోగించాలి' అనే నినాదంతో తయారు చేసిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రతి విద్యార్థి చక్కని సందేశాన్ని సమాజంలోకి తీసుకువెళ్లే దిశగా ఆచార్యులు కృషి చేయాలన్నారు. విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్లాస్టిక్‌పై నిషేధం విధించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో సైతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధించారని, దీనిని ప్రజలంతా పాటించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను గుర్తించాలని, భవిష్యత్ తరాలు పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్రప్రసాద్, జి.శశిభూషణరావు, డాక్టర్ బి.ప్రవీణ, డాక్టర్ వి.వి.వి ప్రకాష్, డాక్టర్ కె.రాము, డాక్టర్ రాజు, హేమలత తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

విశాఖ కేంద్రంగా చిత్ర పరిశ్రమ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ధనుంజయ్

దాబాగార్డెన్స్: విశాఖ కేంద్రంగా చిత్ర పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపా ధనుంజయ్, ఉపాధ్యక్షుడు బైటింటి మీనాక్షిరెడ్డి, దారపు ప్రసాద్‌రెడ్డి, ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు తోరం రాజా కోరారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. చిత్ర పరిశ్రమలో నటీనటులు, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఏపీ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ పనిచేస్తోందన్నారు. అసోసియేషన్ సభ్యులందరికీ పని కల్పించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని, బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని, సొంత గృహాల సాధన కోసం అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టాలీవుడ్ పెద్దలు చర్చలు జరిపి చిత్ర పరిశ్రమపై ఆధారపడిన వారిని ఆదుకోవాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి శిల్లా సుజాత, గంధం విజయరమణి, నిర్మలభాను, రెడ్డిపల్లి పూజాకుమారి, డి.ప్రసాదరెడ్డి, మత్తి రత్నకుమార్, తలారి సురేష్, కంద గాయత్రి, గొందేశి రమణారెడ్డి, భరత్, మాసవరపు శ్రీనివాస్, ఏలూరు లక్ష్మి, దున్నా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చార్జీల పెంపు ప్రతిపాదన తగదు



ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న కార్మికులకు విద్యుత్ చార్జీలు పెంచాలని యాజమాన్యం చేస్తున్న ప్రతిపాదన విరమించుకోవాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా ఉన్న చార్జీలను అమాంతం పెంచేందుకు రంగం సిద్ధం చేయడం దుర్మార్గమన్నారు. కనీస నివాసయోగ్యం కాని క్వార్టర్స్‌లో ఉంటున్న కార్మికులపై భారం మోపడం సరికాదన్నారు. ఐఎన్‌టీయూసీతో చేసుకున్న ఒప్పందం వల్ల క్వార్టర్స్ ఖాళీ చేస్తే హెచ్‌ఆర్‌ఏ పొందే అవకాశాన్ని కోల్పోయారన్నారు. విద్యుత్ చార్జీల పెంపు, ఉక్కు హౌస్, స్కూల్ ఫీజులు పెంచుతూ నిర్ణయం తీసుకున్నప్పటికీ గుర్తింపు యూనియన్ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో నాయకులు జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, యు.రామస్వామి, డి.వి.రమణారెడ్డి, డి.సురేష్‌బాబు, సీహెచ్ సన్యాసిరావులు ప్రసంగించారు.

ఐఐపీఈ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ)కి చెందిన 31 మంది విద్యార్థులు జూన్ 15 నుంచి 28 వరకు పూణేలోని ఎంఐటీ వరల్డ్ పీస్ యూనివర్సిటీలో నిర్వహించిన 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ పెట్రోలియం ఇంజినీరింగ్' నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జియో కెమిస్ట్రీ, ఆఫ్‌షోర్, నేచురల్ గ్యాస్ తదితర అంశాలపై వారికి విస్తృత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఐపీఈ ఇండస్ట్రీ ప్రొఫెషనల్, గెయిల్ సీజీఎం పంకజ్ భగత్ పాల్గొన్నారు.

పోరాటాలతో విశాఖ ఉక్కును కాపాడుకుంటాం



872వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఎందరికో ఉపాధినిస్తున్న విశాఖ ఉక్కును కార్మికులందరు తమ పోరాటాలతో కాపాడుకుంటారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 872వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అనేక మంది ప్రధానమంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పి పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారని కొనియాడారు. నేటి పాలకులు మాత్రం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పేదప్రజల జీవితాలను సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

త్రిశక్తి ఆలయంలో చండీహోమం

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో సోమవారం మహాదుర్గ అమ్మవారికి సప్తశతి చండీ హోమం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో శాస్త్రోక్తంగా జరిగిన హోమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహాదుర్గ అమ్మవారికి వేకువజామున ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

కాలుష్య నియంత్రణకు సహకరించండి



జీవీఎంసీ కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణకు, పర్యావరణ పరిరక్షణకు అందరి సహకారం అవసరమని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై ఆయన చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖలో పర్యావరణ పరిరక్షణకు అందరు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, నగర ప్రజలు, వివిధ వ్యాపార సంస్థలు, విద్యా సంస్థల యాజమాన్యాలు కాలుష్య నియంత్రణకు సహకరించి, వారంలో ఒక్కరోజు ప్రజారవాణాను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు.